క్లుప్తంగా

సర్వేలను పకడ్బందీగా చేపట్టండి



ఉయ్యాలవాడలో సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

ఉయ్యాలవాడ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సర్వేలను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు సచివాలయ సిబ్బందికి సూచించారు. గురువారం ఉయ్యాలవాడలో జరుగుతున్న పి–4, వర్క్ ఫ్రమ్ హోం సర్వేలను ఎంపీడీఓ పరిశీలించారు. యాప్‌లో పొందుపరిచిన అంశాలను క్షుణ్ణంగా కుటుంబ సభ్యులకు వివరించి వారు తెలిపిన సమాచారాన్ని మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వేను వేగవంతం చేసి మార్చి 2వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు.

రైతులకు అవగాహన



ముత్యాలపాడు గ్రామంలో రైతులతో ఏఓ

చాగలమర్రి: రబీ సీజన్‌లో సాగు చేస్తున్న పంటలు పూత దశలో ఫలదీకరణ జరిగి అధిక శాతం గింజలు ఏర్పడాలంటే 5 శాతం బోరాన్ మందును పిచికారీ చేయాలని చాగలమర్రి మండల వ్యవసాయాధికారి రంగనేతాజి రైతులకు సూచించారు. గురువారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. అదే విధంగా రైతు విశిష్ట సంఖ్య నమోదు ఆవశ్యకతను తెలియజేశారు. రైతులు మార్చి 3వ తేదీలోగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలని తెలిపారు.

ఆసుపత్రికి తరలింపు



మతిస్థిమితం లేని వారిని తరలిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో తిరుగుతున్న ఆరుగురు నిరాశ్రయులు, మతిస్థిమితం లేని వారిని కడప పట్టణానికి చెందిన మనోబంధు ఫౌండేషన్ కో ఆర్డినేటర్ శివారెడ్డి, నంద్యాల స్టార్ సొసైటీ కార్యదర్శి సుబ్బరాయుడు శివారెడ్డి, సుబ్బరాయుడు గురువారం ఆసుపత్రికి తరలించారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని పలు ప్రాంతాల్లో తిరుగుతున్న రాముడు, సుభద్ర, నూరుల్లా, సుభాషిణి తదితరులను ఆరోగ్య రీత్యా కడపలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఆసుపత్రికి పంపినట్లు తెలిపారు. అక్కడ వైద్య పరీక్షలు చేసి మందుల ద్వారా నయం చేసి వారి బంధువులకు అప్పగిస్తారన్నారు. ఎవరూ లేని నిరాశ్రయులను హోంలోనే ఉంచుతారని చెప్పారు.

ఓంకారంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ



ఓంకారంలో కొనసాగుతున్న భక్తుల రద్దీ

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని ఓంకార క్షేత్రంలో శివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు పంచ బుగ్గల కోనేరులో పుణ్య స్నానాలు చేసి, ఓంకార సిద్ధేశ్వర స్వామిని, అమ్మ వారిని దర్శించుకుని పూజలు, అభిషేకాలు చేశారు. తర్వాత వ్యాస మహర్షి ప్రతిష్ఠించిన ఆంజనేయ స్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేసి, నల్లమల కొండపై బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులను సందర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో గంగా ఉమా సమేత ఓంకారేశ్వరున్ని నంది వాహనంపై కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు.

లుంగీ మాటున బ్యాగు చోరీ



లుంగీలో బ్యాగును పెట్టుకుని తీసుకెళ్తున్న దొంగ

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం ఎల్లార్తికి చెందిన లక్ష్మీకాంతరెడ్డి, విష్ణు కుటుంబ సభ్యులు గురువారం మహానందికి వచ్చారు. చిన్నకోనేరులో స్నానాలకు వెళ్తూ వారి దుస్తులను పక్కనే ఉన్న జువ్విచెట్టు అరుగుపై పెట్టారు. నలుగురు దొంగలు తెలివిగా వస్త్రాలు మార్చుకుంటున్నట్లు నటిస్తూ ముందు ఒకడు అరుగుపైకి వెళ్లి లుంగీ మాటున డ్రాయర్ మార్చుకుంటున్నట్లు నటించి క్షణంలో బ్యాగును తస్కరించగా మిగిలిన ముగ్గురు కవర్ చేస్తూ వచ్చారు. బాధిత భక్తులు బయటికి వచ్చి చూసుకోగా బ్యాగు కనిపించక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాగులో రూ.28 వేల నగదు, ట్యాక్సీ తాళాలు ఉన్నాయని బాధితులు తెలిపారు. కాగా చోరీ దృశ్యం సీసీ కెమెరాలో నమోదైంది.



ప్రథమనంది ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న పండితులు



సంజీవనగర్ రామాలయంలో కల్యాణం అనంతరం కాశీవిశ్వనాథుడు, విశాలాక్షి

కమనీయం.. ఆది దంపతుల కల్యాణం



గుడిపాటిగడ్డలోని మల్లికార్జునస్వామి దేవస్థానంలో కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శైవాలయాల్లో మహాశివరాత్రి సందర్భంగా బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఆది దంపతులైన శివపార్వతుల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. మహాన్యాస పూర్వక ఏక రుద్రాభిషేకం, లింగోద్భవ కాలం అనంతరం కల్యాణం జరిపించారు. భక్తులు పండుగ రోజు ఉపవాస దీక్షలు, రాత్రి జాగారణ, శివ నామస్మరణలతో దేవాలయాలను దర్శించుకొని పులకించారు. ప్రథమనందీశ్వర దేవాలయం, సోమనందీశ్వర దేవాలయం, సమజీవనగర్ రామాలయం, ఎన్‌జీ రోడ్డులోని నాగలింగేశ్వర ఆలయం, రోజాకుంటలోని నాగలింగేశ్వర ఆలయం, మల్లికార్జునస్వామి దేవాలయం, కాళికాంబ చంద్రశేఖర దేవాలయం తదితర దేవాలయాల్లో గురువారం తెల్లవారుజామున 4గంటల వరకు కల్యాణోత్సవ కార్యక్రమాలను నిర్వాహకులు నిర్వహించారు.కల్యాణోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వేడుకను తిలకించారు. శివపార్వతుల కల్యాణోత్సవంలో పండితుల వేద మంత్రోచ్ఛారణ,



నాగలింగేశ్వర ఆలయంలో లింగోద్భవ అనంతరం ప్రత్యేక అలంకారంలో స్వామి వారు

కల్యాణం గణపతి పూజతో ప్రారంభమై పుణ్యాహవాచనం, స్వామివారికి కంకణధారణ, తిలకధారణ, జీలకర్రబెల్లం, తాళిబొట్టు కార్యక్రమం, తలంబ్రాలు అనంతరం సదివింపుల కార్యక్రమం నిర్వహించారు.

- ప్రథమనందీశ్వర దేవాలయంలో ప్రథనందీశ్వరుడు, కేదారేశ్వరి మాతకు కల్యాణం జరిపించారు.
- సంజీవనగర్ రామాలయంలో కాశీవిశ్వనాథుడికి



ప్రథమనంది ఆలయంలో కల్యాణం అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు



స్వామివారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

లింగోద్భావ సమయాన అష్టోత్తర కలశ, క్షీరాభిషేకం చేపట్టి ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వేదపండితుల ఆధ్వర్యంలో కల్యాణం జరిపించి గురువారం సాయంత్రం స్వామి అమ్మవార్లకు గ్రామోత్సవం చేశారు.

- కాళికాంబ దేవస్థానంలో స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని మాడుగుల సుబ్రహ్మణ్యశాస్త్రి, రాఘవేంద్రచారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.
- రోజాకుంటలోని శ్రీనాగలింగేశ్వరస్వామి దేవాలయంలో లింగోద్భవ సమయంలో సుధీంద్రాచారి ఆధ్వర్యంలో కల్యాణం చేపట్టారు.

చూసిన కనులదే భాగ్యం



చాగలమర్రి: బుగ్గమల్లేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణం

చాగలమర్రి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని చాగలమర్రిలోని బుగ్గ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల శివనామస్మరణ శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఉభయదారులుగా క్రిష్ణం శివప్రసాద్, కందూరు నాగేశ్ కుమార్ వ్యవహరించారు. అదే విధంగా చాగలమర్రిలోని రామలింగేశ్వరస్వామి, భీమలింగేశ్వరస్వామి, చింతలచెరువు భైరవగుండాల ఆలయాల్లో స్వామివారి కల్యాణం నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల గ్రామోత్సవం



డబ్ల్యూ గోవిందిన్నెలో శివపార్వతుల గ్రామోత్సవం

దొర్నిపాడు: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా జరిగింది. ఆయా గ్రామాల్లో గురువారం పల్లకీలో శివపార్వతులను కొలువుంచి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా.. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



గోవిందపల్లెలో శివపార్వతుల కల్యాణం

శిరివెళ్ల: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగాయి. గోవిందపల్లె, యర్రగుంట్ల, కోటపాడు, వెంకటాపురం, బోయలకుంట్ల, శిరివెళ్లలోని ఆలయాల్లో బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. యర్రగుంట్లలో శ్రీరామ సేనా కమిటీ ఆధ్వర్యంలో అఖండ జ్యోతి వెలిగించి దీపాలతో మహిళలు గ్రామంలో ఊరేగింపు చేశారు. గురువారం భక్తులకు అన్నదానం చేశారు.



యర్రగుంట్లలో అఖండ జ్యోతి

సత్ప్రవర్తనతో మెలగాలి



ఉప కారాగారంలో ఖైదీలను ఉద్దేశించి మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శేషాద్రి

ఆళ్లగడ్డ: క్షణికావేశంలో నేరాలకు పాల్పడి రిమాండ్ ఖైదీలుగా ఉన్న వారు సత్ప్రవర్తనతో మెలగాలని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ లీలా వెంకట శేషాద్రి అన్నారు. స్థానిక ఉప కారాగారంలోని న్యాయ సహాయ కేంద్రాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కారాగారంలో ఉన్న ఖైదీల కేసులను అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదులు ఉన్నారా అని ఆరా తీశారు. అలాగే జైలులో కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఆర్థిక స్థోమత లేని రిమాండ్ ఖైదీలు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదులను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపకారాగారాధికారి సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడులు



హరివరంలో శనగ రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సుధాకర్



డబ్ల్యూ గోవిందిన్నెలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ ప్రమీల

ఉయ్యాలవాడ: రైతులు ఒకే రకం పంట కాకుండా పంట మార్పిడి చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కోవెలకుంట్ల వ్యవసాయ సంచాలకుడు సుధాకర్ రైతులకు సూచించారు. గురువారం మండలంలోని హరివరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన తరిగోపుల ప్రసాద్‌రెడ్డి సాగు చేసిన శనగ పంటను పరిశీలించారు. 30 ఏళ్లుగా రబీలో ఒకే పంట పప్పుశనగ సాగు చేస్తున్నారు, పంట మార్పిడి చేస్తే తప్పా తెగుళ్ల నివారణ సాధ్యం కాదని స్పష్టం చేశారు. అధిక వర్షాలకు భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండడంతో వేరుకుళ్లు, ఎండు తెగుళ్లు శనగ పంటకు ఆశించాయన్నారు. దీంతో దిగుబడులు ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్లలోపే వస్తున్నాయని చెప్పారు. గ్రామ యూనిట్‌గా తీసుకుని ప్రతి గ్రామంలో పంట కోత ప్రయోగాలు చేయడం ద్వారా దిగుబడులు తెలుసుకోగలిగామని తెలిపారు. ఏటా రబీకి ముందు ఖరీఫ్‌లో 60 రోజులు లేదా 90 రోజులు పంట దిగుబడులు వచ్చే కొర్ర, సజ్జలు, మినుము, తదితర చిరు ధాన్యాలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, డీడీఏ చెన్నయ్య, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

దొర్నిపాడు: రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రమీల అన్నారు. గురవారం మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూకొత్తపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుసేవా కేంద్రాలతో పాటు, మీసేవ కేంద్రాల్లోనూ ఫార్మర్ రిజిస్ట్రీ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే రబీలో సాగుచేసిన పంటలకు మార్చి 1లోగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు వినోద్, వంశీ పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రోత్సాహం



ఉయ్యాలవాడ ముస్లిం శ్మశాన వాటికలో నాటిన టెంకాయ చెట్లను పరిశీలిస్తున్న ప్లాంటేషన్ సూపర్‌వైజర్

ఉయ్యాలవాడ: జాతీయ ఉపాధి హామీ పథకం కింద పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం కల్పిస్తోందని కోవెలకుంట్ల క్లస్టర్ ప్లాంటేషన్ సూపర్‌వైజర్ రషీద్ బాషా తెలిపారు. గురువారం స్థానిక ముస్లిం శ్మశాన వాటికలో, రైతులు పొలం గట్లపై నాటిన టెంకాయ మొక్కలను పరిశీలించారు. కోవెలకుంట్ల క్లస్టర్ పరిధిలోని సంజామల, దొర్నిపాడు, ఆళ్లగడ్డ, చాగలమర్రి, రుద్రవరం, ఉయ్యాలవాడ మండలాల పరిధిలో 2025–26 ఆర్థిక సంవత్సరానికి 1000 ఎకరాల్లో పండ్ల తోటల సాగు లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఈ మేరకు సన్న, చిన్న కారు రైతులను గ్రామాల్లో గుర్తిస్తున్నట్లు చెప్పారు. సాగుకు సంబంధించి మొక్కల రకాలను బట్టి రూ.లక్ష నుంచి రూ.1.80 లక్షలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. 2024–25 సంవత్సరంలో క్లస్టర్ పరిధిలో 1500 ఎకరాల్లో మొక్కలు నాటాల్సి ఉండగా 650 ఎకరాల్లో నాటినట్లు వెల్లడించారు. మొక్కల పెంపకంపై ఉపాధి సిబ్బంది ద్వారా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈయన వెంట ఏపీఓ రవిప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్లు షరీఫ్ బాషా, ఓబులరెడ్డి, తిరుమలరావు ఉన్నారు.

ఆవు మృతిపై ఫిర్యాదు



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, అటవీశాఖ సిబ్బంది

చాగలమర్రి: మండల పరిధిలోని కదిరిపురం తండాలో అనుమానాస్పద స్థితిలో ఆవు మృతిచెందింది. దీనిపై బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. కదిరిపురం తండాకు చెందిన క్రిష్ణనాయక్, రాజునాయక్, నాగేంద్ర నాయక్ కొన్నేళ్లుగా వైఎస్సార్ జిల్లా ఉప్పరిపల్లె గ్రామంలోని సద్గురు సత్యనారాయణ ఆశ్రమంలో నిర్వహిస్తున్న గోశాలకు చెందిన 300 ఆవులను కదిరిపురం తండాలో మేపుతున్నారు. కొద్ది రోజుల క్రితం 4 ఆవులు అదృశ్యమయ్యాయి. ఆ క్రమంలో గురువారం ఉదయం రాజ్‌కుమార్ నాయక్, మోహన్‌రెడ్డి పొలం సమీపంలోని అటవీ సరిహద్దు ప్రాంతంలో తవ్విన గుంత నుంచి దుర్వాసన వస్తుండడంతో వెళ్లి చూడగా ఓ ఆవు కళేబరం కనిపించింది. గోశాల నిర్వాహకుడు నాగేంద్రరావుతో పాటు అటవీ అధికారులు, పోలీసులకు కాపరులు క్రిష్ణనాయక్, రాజునాయక్, నాగేంద్ర నాయక్ సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చాగలమర్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి విచారిస్తున్నారు. కొందరు రైతులు పొలాల్లో ఉద్దేశపూర్వకంగా విద్యుత్ వైర్లు, ఉచ్చులు ఏర్పాటు చేస్తున్నారని.. ఆవు మృతితో వాటిని హుటాహుటిన తొలగించారని కాపరులు ఆరోపించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు



బ్రాహ్మణకొట్కూరు రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ

నందికొట్కూరు: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండల పరిధిలోని బ్రాహ్మణకొట్కూరు పాలిమేరలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మినుము, శనగ, పంటలో పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. శనగ పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వేసవి దుక్కులు పంటలకు ఎంతో రక్షణ ఇస్తుందన్నారు. జిగురు అట్టలు, పచ్చిరొట్ట ఎరువులను వేసుకోవాలని సూచించారు. మినుము, శనగ పంటలను ఆశించిన లద్దె పురుగు, కాయ తొలుచు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆయన వెంట ఏడీఏ జయశేఖర్ ఉన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



రాతి దూలాన్ని లాగుతున్న వృషభాలు

ఓర్వకల్లు: మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన అంతర్రాష్ట్ర వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. మహాశివరాత్రి పండుగ సందర్భంగా బుగ్గరామేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో జరిగిన న్యూకేటగిరీ వృషభాల పోటీల్లో మొత్తం 9 ఎడ్ల జతలు పాల్గొన్నట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. ఇందులో ప్యాపిలి మండలం, డి.రంగాపురానికి చెందిన జూటూరు రామకృష్ణారెడ్డి, నంద్యాల మండలం, మల్యాలకు చెందిన షేక్ హైమున్న (ఉభయ జత) వృషభాలు నిర్ణీత సమయంలో రాతి దూళాన్ని 3398 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.60 వేలు గెలుపొందాయి. తర్వాతి స్థానాల్లో నిలిచిన వైఎస్సార్ జిల్లా, బాలయ్యగారిపల్లె విష్ణువర్ధన్‌రెడ్డి వృషభాలు (3102 అడుగులు) రూ.40 వేలు, గద్వాల జిల్లా, ఇటిక్యాల మండలం, శనగపల్లె చక్రవర్తి గౌడు, కర్నూలు మండలం, రేమట నడిపి గట్టయ్య ఉభయ జత వృషభాలు (3071 అడుగులు) రూ.30 వేలు, అలంపూరు మండలం, కంచుపాడు విశ్వనాథ్‌రెడ్డి, గోనెగండ్ల మండలం, హెచ్.కైరవాడి లక్ష్మన్న ఉభయ జత వృషభాలు (3048 అడుగులు) రూ.20 వేలు గెలుపొందాయి. అలాగే లక్ష్మంపల్లెకి చెందిన గుంటూరు శివారెడ్డి, పి.రుద్రవరం ఎల్లగౌడు ఉభయ జత వృషభాలు (2704 అడుగులు) రూ.10 వేలు, జూటూరు రామకృష్ణారెడ్డి, దేవేంద్రారెడ్డి ఉభయ జత వృషభాలు (2700 అడుగులు)రూ.8 వేలు గెలుచుకున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

పరీక్షల వేళ ఆహారం ఇలా..



నంద్యాలలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ క్యాంపు (ఫైల్)



డాక్టర్ వెంకటరమణ, డీఎంఅండ్‌హెచ్‌ఓ,

నంద్యాల(న్యూటౌన్): త్వరలో పదో తరగతి, ఇంటర్ మీడియెట్ వార్షికపరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులు చదువు మీద ధ్యాసతో సరైన ఆహారం తీసుకోవడం మర్చిపోతారు. గంపెడు సిలబస్‌ను వడపోసి ప్రశ్నా పత్రాల్లో వచ్చే ప్రశ్నలకు జవాబులు రాయాలంటే ముందుగా విద్యార్థికి కావాల్సింది ఆరోగ్యం. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు నెల రోజుల ముందు నుంచే తేలికపాటి ఆహారం అందించడం ఉత్తమమని నంద్యాల డీఎం అండ్‌హెచ్‌ఓ వెంకటరమణ తెలిపారు. రోజూ ఇంట్లో వండే వంటల్లోనే చిన్న, చిన్న మార్పులతో తేలిక పాటి ఆహారాన్ని వండి పెట్టాలని సూచిస్తున్నారు.

ఏమేం తినాలి..

- అధిక కారం, మసాలా, నూనెలతో తయారైన ఆహార పదార్థాలను తీసుకోకపోవడం మంచిది. వాటికి దూరంగా ఉంటే మరీ మంచిది. రోజూ కనీసం 6 నుంచి 8 గంటలు నిద్ర పోవాలి. తేలికగా జీర్ణమయ్యే ఇడ్లీ, రసంతో భోజనం చేయాలి. పెరుగు, మజ్జిగ పరిమితంగా తీసుకోవాలి.
- అందుబాటులో ఉండే తాజా పండ్లు తీసుకోవాలి. ద్రాక్ష, అరటి పండు, అనాస, దోస వంటివి ఆరోగ్యకరం. పరీక్షలు జరిగే రోజుల్లో మాంసాహారానికి దూరంగా ఉండటం శ్రేయస్కరం. మంచి ఆహారంతో పరీక్షల గండం గట్టెక్కినట్లే.

టైం టేబుల్...

- మెదడు తాజాగా ఉండాలంటే పరీక్షల సమయంలో విద్యార్థులు ఉదయం 4.30 గంటలకు లేవడం రాత్రి 10.30 గంటలకు ముందుగా నిద్రపోవడం అలవాటు చేసుకోవాలి.
- మెదడు చురుగ్గా పని చేయడానికి ప్రొటీన్లు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ముఖ్యంగా చిక్కుడు, కూరగాయలు, పండ్లు తినాలి. ఉదయం లేచిన వెంటనే కొద్దిసేపు వ్యాయామం చేయాలి. తరువాత ఇడ్లీ, పాలు తీసుకోవడం ఉత్తమం. అనంతరం చదువు ప్రారంభించాలి.
- పరీక్ష రాసి ఇంటికి వచ్చాక పండ్లు, పండ్ల రసాలు తాగాలి. పెరుగుతో ఆహారం తీసుకోవచ్చు. సాయంత్రం చదువు ప్రారంభించేటప్పుడు కప్పు టీ తాగాలి. చదువడం అయిపోయాక నిద్రకు ఉపక్రమించే గంట ముందు తేలికపాటి భోజనం తీసుకోవాలి.
- ఒత్తిడికి గురికాకుండా నిద్ర పోవాలి. రోజులో ఎక్కువ సార్లు పాలు తాగండి. మెదడు చురుగ్గా పని చేస్తుంది. ఒకసారి రాస్తూ చదివితే పదిసార్లు చదివినట్టే.


ముత్యాల తలంబ్రాలతో మురిసిన మహానందీశుడు



మహానందీశ్వరుడి దంపతులకు కల్యాణోత్సవం

మహానంది: స్థానిక కల్యాణ మండపం వద్ద మహానందీశుడి దంపతుల కల్యాణం గురువారం కనులపండువగా సాగింది. వేలాది భక్తజనం వధూవరులైన మహానందీశ్వరుడి దంపతులకు ముత్యాల తలంబ్రాల అక్షింతల వేసి తరించారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, ఉప ప్రధాన అర్చకులు వనిపెంట జనార్దనశర్మ, ముఖ్య అర్చకులు రాఘవశర్మ, పండితులు, రుత్వికుల బృందం వధూవరులను అలంకార మండపం నుంచి తీసుకొస్తూ రాజగోపురం ముందు ఎదురుకోళ్ల ఉత్సవం చేపట్టారు. అనంతరం కల్యాణవేదిక వద్ద మాంగల్య ధారణ పూజలు చేపట్టారు.

వరుడు మహానందీశ్వరస్వామి తరపున గుండంపాడుకు చెందిన శివరామిరెడ్డి, రమాదేవి, కుటుంబ సభ్యులు, వధువు కామేశ్వరీదేవి తరపున గుండుపాపలకు చెందిన ముక్కమల్ల ప్రహ్లాదరెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు పెళ్లి పెద్దలుగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ విశ్వనాథ్, ఏఈఓ ఎరమల మధు, సూపరింటెండెంట్లు అంబటి శశిధర్‌రెడ్డి, దేవిక, ఆలయ ఇన్‌స్పెక్టర్లు శ్రీశైలం చిన్నా, మహానంది శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.



కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తులు